# పిచ్చికల్లంకలో రవణరాజు

ఆ సంగతి వూళ్ళో అందరికీ తెల్సు.

ఎలాంటి స్వార్థం లేని మనిషతను. నీతీ నిజాయితీ గల మనిషతను.

చూడ్డానికి సన్నగా రివటలాగుండే అతని పేరు రవణరాజు పెద్ద కళ్ళు బాగా లోతుకి పోయుంటాయి. గిరజాలజుట్టు కోర మీసాలు. చారల పైజామా ఓపెన్ షర్టు వేసుకుంటాడు.

పిల్లంక అవతలున్న గోవలంక పక్కనుంది పిచ్చికల్లంక. ఆ వూళ్ళో వుండే రవణరాజు ఒక లక్ష్యంతో అవిటి అమ్మాయిని చేసుకున్నాడు. రెప్ప ఓ పట్టాన ఆర్పకండా సూటిగా చూసే అతని చూపులు ఏదో నిజాన్ని వెతుక్కుంటాపోతుంటాయి. సుడిగుండం వచ్చి మెలేసుకుపోయినా సరే నమ్మిన దానికోసం నిలబడిపోయే మనిషి రవణరాజు. చూసే వాళ్ళకి అతను చేసే పనిలో దూకుడూ ఆవేశం మాత్రమే కనపడతాయి. కానీ, జాయిగా చూస్తే నికార్సయిన ఒక నిజాయితీ ఉంటది అతని తీరులో.

* * *

నారాయణరాజూ, గాంధీరాజూ అన్నదమ్ములు. పిచ్చికల్లంకలో బాగా డబ్బున్నోళ్ళు ఈళ్ళే. అదేంటో మరి గాంధీరాజు ఎంత మంచోడో, నారాయణరాజు అంత చెడ్డోడు.

లంకల్లో ఉన్న రెయ్యల చెరువుల తగాదాలొచ్చి ఒక చల్దిపొద్దేళ చింతపల్లి రాజు తల బోర కాడ్నించి నరికేసి కేసు మాఫీ చేయించేసేడు నారాయణరాజు. అప్పట్నుంచీ వూళ్ళో వాళ్ళెవరూ నారాయణ్రాజుకి ఎదురు తిరగరు. కొలగారంపాట, ఆసీలు వసూళ్ళు, దేవుడి మాన్యాలూ, తలుపులమ్మతల్లి గుళ్లో హుండీపాటా, సారా పాటలూ, అన్నీ తనే తీసుకుంటా ఎడాపెడా సంపాయిస్తున్నాడు నారాయణ్రాజు.

అలాగ కొన్నాళ్ళు గడిచేక అదేం దొబ్బిడాయో ఊళ్ళో పొలాలన్నీ తన పేర్నుండాలని కోరిక పుట్టి తన పక్కనున్న సన్నకారు రైతుల పొలాల్ని చవగ్గా అమ్మమన్నాడు. నారాయణ్రాజుకి భయపడిపోయిన పిరికోళ్ళంతా అమ్మేశారు. కొందరైతే ఎదురు తిరగలేక ఎటూ తేల్చుకోలేక నారాయణ్రాజుకి కన్పించకండా తప్పించుకు తిరుగుతున్నారు. ఎదురు తిరిగినవాళ్ళ పొలానికి నీరు రాకండా, దమ్ము చేసుకోనీయకండా అడ్డు రావడం లాంటెయ్యి చేస్తా ఉండేవాడు నారాయణ్రాజు. ఒకవేళ అన్నీ ఆళ్ళకి బాగా జరిగినా పంట చేతికొచ్చే టయానికి నిప్పంటిచేవాడు. దాంతో నారాయణ్రాజు బాధ భరించలేక అణాకాణీ ధరకి పొలాల్ని అమ్మేసేరా చిన్న రైతులు.

రోజులు గడుస్తున్నాయి.

రోహిణీ కార్తెళ్ళాకా పడ్డ వానలకి గాదుల్లోపోసిన విత్తనాలొడ్లు బోదికాలవలో మూడ్రోజులు నానబోయించి కోర పైకొస్తుండగా బోరింగ్షెడ్డు పక్కన వేయించిన ఆకుమడి చెక్కలో విత్తనాలు జల్లించాడు రవణరాజు.


నెలరోజుల్లో చిక్కగా ఎదిగిన ఆకుమడిని పీకించి పొలంలో ఊడ్పించి రెండుసార్లు కలుపు తీయించి, రెండుసార్లు పిండి పెట్టించి అప్పుడప్పుడూ పురుగు పట్టకండా మందుకొట్టించి వూళ్ళో అందరిపొలాల కన్నా తన పొలం ఎక్కువ దిగుబడి ఇచ్చేలా పండించేడు ఆ ఏడాది.

ఆ చేలో పంట గురించి ఊళ్ళో నలుగురూ గొప్పగా చెప్పుకోడంతో తమ్ముడు గాంధీరాజు పొలం మీద పడింది నారాయణరాజు కన్ను. గాంధీరాజుని పిల్చి పొలం అమ్మమన్నాడు.

గాంధీరాజుగారు అన్నగారి మాటకు అడ్డు చెప్పకపోయినా తను మాత్రం పెదనాన్న నారాయణ్రాజుకి ఎదురు తిరిగేడు. అది తెల్సి నారాయణ్రాజు చేతిలో పొలాలు పోగొట్టుకున్నోళ్ళు రవణరాజు పక్క కొచ్చేసేరు.

రోజు రోజుకీ నారాయణ్రాజుగారి ఆగడాలు పెరిగిపోతున్నాయి. ఎలాగైనా సరే మీరే ఎదురెళ్ళాలని ఎగదోసేరు రవణరాజుని. రెండు మూడుసార్లు తండ్రితో చెప్పాడు రవణరాజు. ‘‘నే చెపుతాలేరా’’ అన్నాడు గానీ, అన్నగారికి భయపడి ఏం చెప్పలేక పోయేడు గాంధీరాజు.





ఇలా కాదు అనుకుని తనే స్వయంగా వెళ్ళి "పెదనాన్నా నీకు మర్యాదిస్తున్నాను. పేదోళ్ళ పొలాలు లాగేసుకున్నావు. మా ఆస్తి జోలికి వస్తే మా నాన్న నీకు భయపడి వూరుకున్నాడేమో కానీ నేను మాత్రం ఊరుకోను" అన్నాడు.

"ఏం చేస్తావు? ఒరేయ్... రేపు మీ పొలంలో నాగళ్ళలా తిరుగుతాయి. నీకు ఎవరు సపోర్టు చేస్తారో చూస్తాను" అన్నాడు నారాయణరాజు.

ఆ మాటకి రవణరాజు రక్తం పొంగిపోయింది. కోపాన్ని కళ్ళల్లోనే అణుచు కున్నాడు. ఏం మాటాడకండా తలొంచుకుని వచ్చేశాడు.

ఆ రాత్రి పొలంలో చిన్నమీటింగు పెట్టేడు. ఆ మీటింగులో జనం సపోర్టు పెరిగిపోయింది రవణరాజుకి. "నారాయణ్రాజుని వేసేద్దాం..ఎంత డబ్బు ఖర్చయినా మేం ఖర్చు పెడతాం...మేం ఖర్చు పెడతాం" అన్నారు.

దూరంగా ఉన్న ఇసకరేంప్ దగ్గరాగింది జెటార్ ట్రాక్టరు. గోదాట్లో వాలుగాలి చూసుకుని జాయిగా వెళ్తున్నాయి తెరచాప పడవలు, లంకంతా పచ్చగా ఉంది. ఆ మిట్ట మధ్యాన్నం మనుషుల జాడసలు లేదు. లంకఒడ్డున సొంత నావలో దిగి పుచ్చకాయల దగ్గర కొచ్చి పండినకాయల్ని కోస్తున్న నారాయణ్రాజుని వెనకనించే కౌంజారుతో పొడిచాడు రవణరాజు అదే అదునుగా నారాయణ్రాజు చేతిలో బలైపోయినోళ్ళు కసికొద్దీ పొడవడం మొదలెట్టారు. ధారలుగా పారిన నారాయణరాజు రక్తం గోదాట్లోకి కాలవగట్టింది. అక్కడికక్కడే ప్రాణాలొదిలేడు నారాయణ్రాజు. అతని శవాన్ని గోదాట్లోకి తోసేసేరు. నారాయణరాజు చచ్చేడని తెల్సిన వూళ్ళో జనం రెండోసారి దీపావళి చేసుకున్నారు. బూర్లూ, గార్లూ నైవేద్యంగా పెట్టి పక్కూళ్ళోళ్ళక్కూడా పంచి పెట్టారు. రవణరాజుకి చేతులెత్తి దణ్ణాలు పెట్టి నువ్వే దేవుడివన్నారు. ఇదాయకంగా మా పిల్లలకి నీ పేరు పెట్టుకుంటా వన్నారు. నీ పటం బెట్టుకుని పూజలు జేసుకుంటావన్నారు.

నారాయణ్రాజు కొడుకు రంగరాజు కేసు పెట్టాడు. భద్రం సాక్ష్యంతో గాంధీరాజు కుటుంబంలోని మగోళ్ళందర్నీ తీసుకుపోయేరు పోలీసోళ్ళు.

వాళ్ళంతా జైల్లో వున్నప్పుడు రంగరాజు రవణరాజు ఇంటికి ఓ కబురు పంపాడు...మా నాన్న కోరిన మాన్యంతో పాటు అన్న పెళ్ళాం మానం ఫణంగా పెడితే కేసు వెనక్కి తీసేసుకుంటాను అని.

ఆ మాట రవణరాజు చెవిన పడింది. జైల్లోవుండే రంగరాజుని నడిరోడ్డుమీద తన మనుషులతో దారుణంగా చంపించేశాడు రవణరాజు.

కొన్నాళ్ళకి బెయిల్‌మీద బయటికొచ్చిన రవణరాజు కేసు మాఫీ చేయించుకున్నాడు.

తండ్రిని తమ్ముడ్ని పోగొట్టుకున్న నారాయణ్రాజు పెద్దకొడుకు కృష్ణమూర్తిరాజు కేసుని హైకోర్టుకి తీసుకెళ్ళాడు. దాంతో కేసు తిరగతోడి గాంధీరాజుని రవణరాజుని అరెస్ట్‌చేసి జైల్లో పెట్టారు.

చాన్నాళ్ళదాకా బెయిల్ దొరకలేదు రవణరాజుకి.

నానాకష్టాలూ పడి ప్రయత్నించగా అతికష్టం మీద దొరికింది బెయిలు.

జైలునుంచి వచ్చిన రవణరాజు మాలపేటలో క్రిష్ణభార్యకి గుండెపోటొస్తే ఒకసారి, ముమ్మిడివరం అవతల మల్లపాలెం సంబంధం చేసిన వీర్రాజుకూతురు గొడవలో పెద్దమనిషిగా వెళ్ళి ఒకసారి ఇలా తన వాళ్ళ అవసరాలకి నిలబడవలసి వచ్చి మూడు వాయిదాలకి హాజరు కాలేకపోయాడు.

ఈ అదను జూసుకున్న కృష్ణమూర్తిరాజు కేసు బలం చేశాడు.

పోలీసులు రవణరాజుకోసం తిరుగుతున్నారు.

రకరకాల వేషాలు వేసి దాక్కుంటూ బెయిల్‌కోసం నానాతంటాలూ పడ్తున్నాడు. బెయిల్ దొరకడం కనాకష్టం అయిపోతుంది. హైకోర్టుకి పెట్టుకున్నాడు.

చాలా లక్షలు ఖర్చయిపోయినియ్యి.

ఆస్తి తరిగిపోతుంది. రాబడిలేక అప్పులోళ్ళు పెరిగిపోతున్నారు.

కృష్ణమూర్తిరాజు పోలీసోళ్ళకి ఎంతిచ్చాడో తెలీదుగానీ, రాత్రికి రాత్రే రవణరాజు ఇంట్లో ఉన్న ఆడాళ్ళని లాకప్పులో పెట్టి రవణరాజు ఎక్కడున్నాడో చెప్పమని కుళ్ళ పొడిచేశారు పోలీసులు.

పోలీసులకి లొంగిపోయిన రవణరాజు సెల్‌లో ఉండే తన మనుషుల్తో కృష్ణమూర్తిరాజుని చంపించేశాడు.

కేసు మరింత బిగుసుకుంది.

వూళ్ళో సాయం చేస్తానన్న వాళ్ళెవరూ ముందుకు రాకపోయేసరికి బెయిల్ దొరకలేదు. డబ్బులు లేక నానా అవస్థలూ పడుతూ జైల్లోనే మగ్గిపోతున్నాడు. తనని చూడ్డానికి వూళ్ళో జనం రాడం కూడా తగ్గించేశారు. దాంతో తనకు తోడుగా ఉంటాం డబ్బులు ఇస్తాం అని చెప్పిన దుర్గారావునీ వాడి పెళ్ళాన్ని గ్యాస్ బిళ్ళలిచ్చి తన మనుషులతో చంపించేశాడు. అది తెల్సిపోయిన పోలీసులు కేసుని మరింత బలం చేసేరు.

హైకోర్టు నించి బెయిల్ సంపాయించి జైలునుంచొచ్చిన రవణరాజు యానాం నించి బ్రాందీకాయలు, స్మగుల్డు చేసేవ్యాపారం మొదలెట్టాడు. అదెందుకు మొదలెట్టాడంటే పంటల్లేవు. అప్పులోళ్ళు పీక్కుతినేస్తున్నారు. పొలంలో ఇటుక బట్టీ పెట్టేడు. పోలీసులొచ్చి అరెస్ట్ చెయ్యబోతే మరి తట్టుకోలేక వాళ్ళని చావ బాది అక్కడ్నుంచి పారిపోయాడు. ఆ సంఘటనలో రవణరాజుకి సాయం చేసిన లచ్చయ్య, అబ్రహాంని మాచరయ్యా, బుల్లెమ్మని అరెస్ట్ చేసి తీసుకుపోయి మోకాళ్ళ మీద కూర్చోపెట్టి కొట్టారు. బయటికొచ్చిన లచ్చయ్యా, అబ్రహాంని అడిగితే ''దేవుడులాంటోడు... ఆయన కోసం మా ప్రాణాలూ కూడా ఇస్తాం'' అన్నారు.

ఆరోజు లగాయతు పిచ్చికల్లంకలో పోలీస్ బందోబస్తు పెట్టారు.

వూళ్ళోకి కొత్తగా ఎవడొచ్చినా అరెస్టు చేసేవారు. కొన్నాళ్ళకి వూరెళ్ళడానికి భయపడేవారు. ఎక్కడ చూసినా పోలీసులు. పారిపోయిన రవణరాజు కనిపిస్తే చంపెయ్యమని ఆర్డర్స్ ఇచ్చింది గవర్నమెంటు.

దాంతో గన్‌లు పట్టుకుని తిరిగేవారు పోలీసులు. ఆవూళ్ళో రవణరాజు గురించి ఏం చెప్పుకుంటే ఏ పోలీసోడు సివిల్‌డ్రస్‌లో వచ్చి వినేస్తాడో, బొక్కలోకి తోసేసి మక్కెలు విరగతన్నేస్తాడోనన్న భయం పట్టుకుని ఎవరూ మాటాడుకునేవారు కాదు. రవణరాజు బంధువులం అని చెప్పుకునేవారు కూడా తగ్గిపోయారు.

కోర్టుచుట్టూ తిరిగి అలసిపోయి మంచాన పడ్డ గాంధీరాజుగారూ ప్రాణాలు వదిలేసేడు చివరకి.

అది తెల్సిన పోలీసోళ్ళు తండ్రి శవాన్ని చూడ్డానికి తప్పకుండా రవణరాజు వస్తాడని వూరంతా కాపలా పెట్టారు. రాత్రి పన్నెండుగంటల టైంలో గాంధీరాజు శవాన్ని స్మశానానికి తీసుకెళ్ళే టైములో చుట్టుపక్కల ప్రాంతాలంతా కరెంటు పోయింది. ఆ చీకట్లో ఎవరికీ తెలీకుండా వచ్చి తండ్రి శవానికి నిప్పంటించి పారిపోయాడు రవణరాజు.

* * *

వర్షాకాలం వచ్చేసింది. గోదాట్లో నీళ్లరంగు మారింది. పూటుగా వున్న గోదారి నిండా వరదనీళ్ళు, ఎర్రనీళ్ళు, వలల్లో పొలసలు ఇరుక్కుపోతున్నాయి.

జనాల మధ్య తిరగలేని రవణరాజు యానాం అవతలున్న మడఅడవులు పట్టి తిరుగుతున్నాడు.

లక్షల విలువ చేసే పొలాలన్నీ పండించేవాడు లేక ఎడారిలా పడున్నాయి. ధైర్యం చేసి ఎవడైనా పొలం ఊడిద్దామని వెళ్తే వాడ్ని చావ బాదుతున్నారు పోలీసులు.

రవణరాజు దొరక్క గవర్నమెంటు ప్రైజు ఎనౌన్స్ చేసింది.

రకరకాల వేషాల్లో వచ్చి భార్యా బిడ్డల్ని కల్సి వెళ్ళిపోయేవాడు రవణరాజు.

ఆఖరుకి నారాయణ్రాజు వంశంలో కొడుకు ఒక్కడే మిగిలాడు. ఆ కుర్రాడ్ని కూడా చంపేస్తాడేమోనని భయపడిన పోలీసులు నారాయణ్రాజు దూరపు బంధువులు మధుర ప్రాంతంలో వుంటే అక్కడ దాచేశారు. వేసవి శెలవులకి కుర్రోడు వూళ్ళోకి వస్తున్నాడని తెల్సి అనుచరులతో మారువేషాల్లో కాపలా కాసాడు రవణరాజు. అది కనిపెట్టేసిన పోలీసులూ వూళ్ళో సెక్యూరిటీ పెంచారు.

దాంతో, రవణరాజు మనుషులతో సహా పోలీసులకి దొరక్కుండా తప్పించుకుని పారిపోయాడు.

కొన్నాళ్ళకి బొడ్డు వెంకటాయపాలెం నించి భైరవపాలెంవెళ్తున్న రవణరాజుని కాపుగాసి చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు పిచ్చికల్లంక తీసుకొచ్చి మరీ కాల్చి చంపేరు.

రవణరాజు మరణాన్ని నమ్మలేకపోయిన అతని అవిటి భార్య ఏ శబ్దం లేకండా ఏడుస్తుంది. ఇప్పటికీ ఏడుస్తానే ఉంది.

రవణరాజుతో అన్ని సాయాలూ పొందిన పిచ్చికల్లంక జనం వాళ్ళింటికెళ్ళి భార్య కుశలం కనుక్కుని వస్తే మళ్ళీ పోలీసులు ఎక్కడ బొక్కలో ఏస్తారో అని భయపడి చడీ చప్పుడు లేకండా ఉండిపోయారు. ఆ ప్రాంతం ఇసకరేంప్‌లో పని చెయ్యడానికెళ్ళిన మావూరి సూరిగాడూ, కుంటిరాంబాబూ ఎన్నేళ్ళక్రితమో జరిగిన ఈ కథ ఇప్పటికీ చెపుతానే ఉంటారు.

* * *